క్లుప్తంగా

జల సంరక్షణ అందరి బాధ్యత



ఫారంపాండ్ల నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ విజయభాస్కర్

బొమ్మనహాళ్: జల సంరక్షణ అందరి బాధ్యత అని ఎంపీడీఓ విజయభాస్కర్ అన్నారు. శనివారం జల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో ఫారంపాండ్ల నిర్మాణాలు ప్రారంభించారు. అనంతరం ఫారంపాండ్ల పనులను ప్రారంభించారు. ఈఓపీఆర్డీ దాస్ పాల్గొన్నారు.

నీటిని ఆదా చేయాలి

కుందుర్పి: నీరు ఆదా చేయడం అందరి బాధ్యతగా తీసుకోవాలని ఏపీడీ రమేష్ నాయక్ సూచించారు. శనివారం బండమీదపల్లిలో జల దినోత్సవం నిర్వహించారు. స్థానిక ఎంపీడీఓ లక్ష్మీశంకర్‌తో కలిసి ఉపాధి పనులకు భూమిపూజ చేశారు. ఎండలు ఎక్కువగా ఉండడంతో కూలీలకు పనులు చేసే ప్రాంతంలో ఏర్పాట్లు చేయాలని ఏపీఓ రవీంద్రకు సూచించారు.

జీవరాశుల మనుగడకు నీరు అత్యవసరం



మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయరామిరెడ్డి

కళ్యాణదుర్గం: జీవరాశుల మనుగడకు నీరు అత్యవసరమని ఎస్వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయరామిరెడ్డి అన్నారు. శనివారం స్థానిక కళాశాలలో అర్థశాస్త్ర విభాగం, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నీటి దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నీటిని వృథా చేయకుండా కాపాడాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శేషయ్య, ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ శ్రీధర్, రాజనీతి శాస్త్ర అధ్యాపకులు శ్యామ్‌ప్రసాద్, రాధాకృష్ణ, గురుమోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.

'కార్పొరేట్‌కు కొమ్ముకాస్తున్న కేంద్రం'

కూడేరు: కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కేశవరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. కేంద్రం ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. ప్రాంతాలు, మతాల మధ్య చిచ్చుపెడుతోందని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను ఖండిస్తూ ఈనెల 23న అనంతపురంలో సీపీఐ ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా, మండల నేతలు రమణ, సంగప్ప, మలరాయుడు, నారాయణమ్మ, ధనరాజు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

రాయదుర్గంటౌన్: ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ప్రతి ఒక్కరూ హెచ్ఐవీ పరీక్షలు చేయించుకోవాలని ఏరియా ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ మెర్సీ జ్ఞాన సుధ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఎయిడ్స్ నియంత్రణ మండలి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, మాస్ ఎడ్యుకేషన్, ఐసీటీసీ ఆధ్వర్యంలో వైద్యాధికారి చేతుల మీదుగా ఐఈసీ పోస్టర్లు, ఫోమ్ బోర్డ్స్ విడుదల చేశారు. కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలర్ కృష్ణమూర్తి, వైద్యులు మాధవి, అజహర్ ఖాన్, ఐసీటీసీ అల్తాఫ్, ప్రాజెక్ట్ మేనేజర్ నీలకంఠ పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

కళ్యాణదుర్గం రూరల్: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని డీఎస్పీ రవిబాబు పాతనేరస్తులను హెచ్చరించారు. శనివారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయ ఆవరణలో అసాంఘిక కార్యకలాపాలు, మాట్కా, పేకాట, క్రికెట్ బెట్టింగ్‌లో పాత కేసుల్లో ముద్దాలతో సమావేశం నిర్వహించారు. వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించకుండా సమాజంలో గౌరవంగా మెలగాలని నిందితులకు సూచించారు. కార్యక్రమంలో సీఐలు యువరాజ్, నీలకంఠేశ్వర్, వంశీ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

హరిజన హాస్టల్ స్థలాన్ని కాపాడాలని ధర్నా



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దళితులు

ఉరవకొండ: స్థానిక పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న గాంధీ హరిజన హాస్టల్ స్థలాన్ని అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని పట్టణంలో దళితులు వందలాది మంది తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా చేశారు. దళిత సంఘం నాయకులు బసవరాజు, రాజులు మాట్లాడుతూ శ్రీగాంధీ హరిజన హాస్టల్‌కు చెందిన సర్వే నం 533–బీ1, 533–సీ లోని 2.67 స్థలాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని అన్నారు. హరిజన హాస్టల్ స్థలంలో ఎస్సీ కాంప్లెక్స్, కమ్యూనిటీ హాల్ నిర్మించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ మహబూబ్‌బాషాతో పాటు పోలీసు స్టేషన్ వద్దకు వెళ్లి అర్బన్ సీఐ మహానందికి వినతిపత్రం అందించారు.

కోరలు చాస్తున్న ప్లాస్టిక్ భూతం



- ప్రతి దానికీ ప్లాస్టిక్ కవర్లు ఉండాల్సిందే
- మరోవైపు కల్తీ నూనెలతో బజ్జీలు, బోండాలు
- నిబంధనలు పాటించని ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు
- నాణ్యత లేకుండా ఆహార పదార్థాల తయారీ
- పట్టించుకోని అధికారులు



పదే పదే వాడిన నూనెలో తయారు చేసిన చికెన్ కబాబ్

కళ్యాణదుర్గం: నోరూరించే రుచులను ఆస్వాదించేందుకు ఆహార ప్రియులు ఎంత ఖర్చయినా భరిస్తున్నారు. ఇంట్లో వంటింటి రుచుల కన్నా మార్కెట్లో ఫాస్ట్‌ఫుడ్‌కే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. హోటళ్లలో త్వరగా రెడీమేడ్‌గా లభించే ఆహార పదార్థాలకు అలవాటు పడిన ప్రజలు.. వాటి నాణ్యతను గుర్తించడం లేదు. సమోసాలు, గారెలు, బజ్జీలు, వడలు వీటితో పాటుగా వేడి వేడిగా లభించే చికెన్, చికెన్ కబాబ్, ఎగ్ ఫ్రైలను తినేందుకు ఎగబడుతున్నారు. ప్లాస్టిక్ పొట్లాలతో పొంచి ముప్పు పొంచి ఉన్నా.. మార్కెట్‌కెళ్లి నిత్యావసరాలు తీసుకురావాలన్నా..కూరగాయలు తీసుకురావాలన్నా.. ఆహార పదార్థాలు తీసుకురావాలన్నా..ప్లాస్టిక్ కవర్లు ఉండాల్సిందే. హోటళ్లు, దుకాణదారులు ఇడ్లీ మొదలు.. ఫాస్ట్‌ఫుడ్ వరకు అన్నీ ప్లాస్టిక్ పొట్లాల్లోనే తెచ్చుకుంటున్నారు. దీంతో కేన్సర్‌ను కొని తెచ్చుకుంటున్నారు. కళ్యాణదుర్గం మున్సిపాలిటీలో వందల సంఖ్యలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, హోటళ్లు ఉన్నాయి. ప్రధానంగా గాంధీచౌక్, బళ్లారి మిట్ట, ఆర్డీటీ ఆసుపత్రి ఎదురుగా, రెవెన్యూ కార్యాలయం ఎదురుగా, ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతాలలో తోపుడు బండ్లపై ఆహార పదార్థాలు తయారు చేసే వ్యాపారం అధికంగా ఉంటుంది. చిరుతిళ్లకు అలవాటు పడిన ప్రజలు వాటిని తినేందుకు ఇష్టపడుతున్నారు.

వెంటాడుతున్న మృత్యువు..

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా కేన్సర్ స్క్రీనింగ్‌ను ప్రారంభించింది. వివిధ రకాల కేన్సర్ పరీక్షలు నిర్వహించింది. ఎక్కువగా నోటి కేన్సర్, రొమ్ము కేన్సర్, గర్భాశయ కేన్సర్ ఉన్నట్లు నిర్ధారించారు. ఇదిలా ఉండగా ఆరోగ్య, వైద్య,కుటుంబ సంక్షేమ శాఖ నివేదిక ప్రకారం ఏటా వేలాది మంది కేన్సర్ జబ్బుతో మృత్యువాత పడుతున్నట్లు గణాంకాలు చెప్తున్నాయి.

పట్టించుకోని అధికారులు

కళ్యాణదుర్గంలో రెండు, మూడు హోటళ్లు మినహా ఇతర ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, హోటళ్లలో నిర్వాహకులు శుభ్రత పాటించడం లేదు. మాంసాహార హోటళ్లలో పరిస్థితి మరీ అధ్వాన్నంగా ఉన్నా పట్టించుకునేవారు కరువయ్యారు. మిగిలిపోయిన మాంసాన్ని రిఫ్రిజిరేటర్లలో ఉంచి, తర్వాత రోజు వినియోగిస్తున్నారు. తనిఖీలకు వచ్చిన ఫుడ్ సేఫ్టీ, మున్సిపల్ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతూ కనీసం దుకాణాలను తనిఖీ చేసే సాహసం కూడా చేయడం లేదు. ప్రజా ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు ఇప్పటికైనా కల్తీ నూనెలతో వంటలు చేస్తున్న ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, హోటళ్లపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్లాస్టిక్ కవర్లే కేన్సర్‌కు కారకాలు

కొన్ని ప్లాస్టిక్ కవర్లలో మనుషుల ఆరోగ్యానికి హాని కలిగించే బిస్ఫినాల్ ఏ (బీపీఏ), థాలేట్స్, ఫ్లేమ్ రిటర్డెంట్స్ వంటి రసాయనాలు ఉంటాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ రసాయనాలు ప్లాస్టిక్ నుంచి బయటకు వెళ్లి ఆహారంలోకి వెళ్లి హార్మోన్ల అసమతుల్యత, పునరుత్పత్తి సమస్యలకు దోహదం చేస్తున్నాయి. ప్రాణాంతకమైన కేన్సర్ వంటి ఆరోగ్య సమస్యలను కలిగిస్తాయి.

ఇలా చేస్తే మంచిది

ప్లాస్టిక్ కవర్ల హానికరమైన ప్రభావాలను తగ్గించడానికి సింగిల్– యూజ్ ప్లాస్టిక్‌ల వినియోగాన్ని తగ్గించాలి. అదేవిధంగా పునర్వినియోగ బ్యాగ్‌లు, కంటైనర్లు, పత్తి లేదా బీస్వాక్స్ వంటి సహజ పదార్థాలతో తయారు చేసిన ర్యాప్‌ల వంటి మరింత స్థిరమైన ప్రత్యామ్నాయాలను ఎంచుకోవాలి.

ఆదాయమే లక్ష్యంగా కల్తీ నూనెల వాడకం..

కాగా ఆదాయమే లక్ష్యంగా కొందరు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, హోటళ్ల యజమానులు కల్తీ నూనె వాడుతూ ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారు. రోజుల తరబడి కడాయిలో వంట నూనెను మార్చకుండా వివిధ రకాల ఆహార పదార్థాలు తయారు చేస్తూ నాణ్యతను విస్మరిస్తున్నారు. మామూళ్లకు అలవాటు పడిన సంబంధిత అధికారులు వంటకాల్లో నాణ్యతను పాటించని వారిపై చర్యలు తీసుకోవడంలో ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు.

వాడిన నూనె నాలుగైదు వంటలకు...

ఆహార పదార్థాలు, వాటి నాణ్యత ఎలా ఉన్నప్పటికీ తయారీకి వినియోగించే నూనె ఒకటికి నాలుగు సార్లు కాచిన నూనెను వాడటంతో అది విషంగా మారుతోంది. ఇటీవల దీని వినియోగం అన్ని చోట్లా విచ్చలవిడిగా పెరిగింది. తాజా నూనెతో తయారు చేసిన ఆహార పదార్థాలకు ఇలా చేసిన వాటికి తేడా ఉన్నప్పటికీ ఆహార ప్రియులు దీన్ని గుర్తించక ఆరగిస్తున్నారు. హోటళ్లలో ఉపయోగించే నూనెను ఒకటి, రెండు సార్లు మరించుకోవచ్చు. అంతకంటే ఎక్కువ సార్లు మరగిస్తే అందులో తయారు చేసే ఆహార పదార్థాలు హానికరంగా మారుతాయని వైద్యాధికారులు హెచ్చరిస్తున్నారు.

జాగ్రత్తలు పాటించాలి



కల్తీ ఆహారం తీసుకోవడం ఆరోగ్య సమస్యలకు దోహదపడుతుంది. కాలేయ, గుండె సంబంధిత వ్యాధులు, హైపర్ టెన్షన్, కొవ్వు పెరగడం, స్థూలకాయం వచ్చే అవకాశం ఉంది. దీంతో పాటు ప్రాణాంతకమైన క్యాన్సర్ బారిన పడే ప్రమాదం కూడా ఉంది. కొన్ని హోటళ్లలో పదార్థాలు ఎక్కువ సార్లు ఫ్రై చేస్తుంటారు. వాటిని తినడం ఆరోగ్యానికి హానికరం. ఆహారం విషయంలో ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలి.

– తరుణసాయి, మెడికల్ ఆఫీసర్, శెట్టూరు

అంగన్‌వాడీ కేంద్రాలు సక్రమంగా నిర్వహించాలి

- ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీదేవి

ఉరవకొండ: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను కార్యకర్తలు సమర్థవంతంగా నిర్వహించాలని ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీదేవి పిలుపునిచ్చారు. స్థానిక చౌడేశ్వరి కాలనీలోని ఎంపీయూపీ ప్రభుత్వ పాఠశాలలో ఈనెల 20న అంగన్‌వాడీలకు పోషణ్‌బీ- పడాయి భీ శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. శనివారం శిక్షణ కార్యక్రమం ముగింపు సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ మండలంలో 84 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు ఈశిక్షణలో పాల్గొన్నారన్నారు. ఆరేళ్లలోపు చిన్నారులకు ఆటపాటలతో విద్యాబుద్ధులు ఎలా నేర్పాలనేదానిపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకున్న కార్యకర్తలు కేంద్రాల్లో ప్రయోగించాలన్నారు. శిక్షణ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు విజయకుమారి, రబియా, తిరుపాల్‌బాయి పాల్గొన్నారు.



ఉరవకొండలో అంగన్‌వాడీల శిక్షణలో మాట్లాడుతున్న సీడీపీఓ శ్రీదేవి

వజ్రకరూరు: మండల కేంద్రంలో ఈనెల 20 నుంచి ప్రారంభమైన శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన శిక్షణలో పోషణ్‌భీ -పడాయిబీపై అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. సూపర్‌వైజర్లు పద్మావతి, హెచ్.పద్మా మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలను పక్కాగా నిర్వహించాలన్నారు. అనంతరం కార్యకర్తలు తయారు చేసిన టీచింగ్ లర్నింగ్ మెటీరియల్‌ను ప్రదర్శించారు.

సనాతన సంప్రదాయాల పరిరక్షణే లక్ష్యం

- ఆధ్యాత్మిక వేత్త మధ్యప్రదేశ్ నర్మదానంద స్వామీజీ

బెళుగుప్ప: ప్రపంచంలోనే అత్యంత ప్రభావితమైన భారతీయ ఆధ్యాత్మిక ఉన్నతిని, సనాతన సంప్రదాయాలను కాపాడుకోవడమే లక్ష్యం అని మధ్యప్రదేశ్‌కు చెందిన నర్మదానంద స్వామీజీ పేర్కొన్నారు. శనివారం మండకేంద్రం మీదుగా పాదయాత్ర చేస్తూ స్థానిక నగరేశ్వరాలయంలో కొంత సేపు సేదతీరారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. సొంత గ్రామం మధ్యప్రదేశ్‌లోని జల్‌కోటి అని, తన గురువు శ్రీమణిమాతాజీ ఆదేశాలతో తొలుత మధ్యప్రదేశ్‌లోని అమర్‌కంటర్ నుంచి పాదయాత్ర ప్రారంభించి, దేశంలోని 42 శక్తి పీఠాలను పాదయాత్రతో దర్శించుకుంటూ వస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 38 శక్తి పీఠాలను 17,000 కిలోమీటర్లు పాదయాత్రతో దర్శించుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం తెలంగాణలోని అలంపూర్‌లోని జోగులాంబ, కొల్హాపూర్ మహాలక్ష్మి, నాసిక్‌లోని దుర్గ, గుజరాత్‌లోని అంబాజీతో కలిపి నాలుగు శక్తి పీఠాలు మిగిలాయన్నారు. ప్రస్తుతం జోగులాంబకు పాదయాత్రతో వెళ్తున్నట్లు తెలిపారు. 42 శక్తిపీఠాల దర్శనానంతరం దేశం వెలుపల ఉన్న మరో పది శక్తి పీఠాలను దర్శించుకోనున్నట్లు తెలిపారు.



బెళుగుప్పలో నర్మదానంద్ స్వామీజీని దర్శించుకున్న స్థానికులు

విద్యుత్ తీగలు తగిలాయో తప్పదు ముప్పు



చేతికందే ఎత్తులో ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలను చూపుతున్న రైతు భీమలింగప్ప



11 కేవీ తీగలు తగలకుండా కట్టెలతో ఎత్తి పొలాన్ని ట్రాక్టర్‌తో దున్నుతున్న రైతులు

ఉరవకొండ: గడేకల్లు గ్రామ పొలాల్లో అత్యంత ప్రమాదకంగా 11 కేవీ విద్యుత్ తీగలు చేతికందే ఎత్తులో వేలాడుతున్నాయి. విద్యుత్ స్తంభాలు కూడా పూర్తిగా ఒరిగిపోయి కూలిపోయేలా ఉన్నాయి. దీనిపై విద్యుత్ శాఖ ఏఈతోపాటు లైన్‌మెన్‌లకు ఎన్నో మార్లు గ్రామస్తులు, రైతులు విన్నవించినా పట్టించుకోవడంలేదు. రెండు నెలల క్రితం విద్యుత్ తీగలు తగిలి గేదెలు, ఎద్దులు, గొర్రెలు 50 వరకు చనిపోయినట్లు బాధిత రైతులు ఆంజనేయ, భీమలింగప్ప, లక్ష్మన్న, నరసింహులు తెలిపారు. గడ్డి ట్రాక్టర్‌కు విద్యుత్ తీగలు తగిలి కాలిపోయింది. ఇలా ఘటనలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోలేదని రైతులు వాపోతున్నారు.



పొలంలో పూర్తిగా కిందకు వంగి కూలడానికి సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభం



కూలడానికి సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని చూపుతున్న రైతు ఆంజనేయ

వడదెబ్బపై అవగాహన కల్పించాలి

బ్రహ్మసముద్రం : వేసవిలో వడదెబ్బపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని వైద్యాధికారి రాజేష్‌కుమార్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండంలోని ఆయా గ్రామ సచివాలయాల్లో పని చేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీలు , ఏఎన్ఎంలతో సమీక్ష నిర్వహించారు. ఆయన 2024 – 2025 వార్షిక ప్రగతి రికార్డులు పరిశీలించారు. ఎన్ సీడీ సర్వే, ఆర్‌సీ హెచ్ సర్వేలను వందశాతం పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ మేరీ, సూపర్‌వైజర్ రామలక్ష్మి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రాణీఎస్తేర్, పార్మసిస్ట్ మహేష్ ల్యాబ్ టెక్నీషియన్ పవన్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మైసూరు-విజయపురకు ప్రత్యేక రైలు

రాయదుర్గంటౌన్: రంజాన్, ఉగాది పండుగలను పురస్కరించుకుని రాయదుర్గం మీదుగా మైసూరు–విజయపురకు ప్రత్యేక రైలు నడుపనున్నట్లు నైరుతీ రైల్వే హుబ్లీ డివిజన్ ముఖ్య సమాచార అధికారి మంజునాథ కనమడి తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. మైసూరులో ఈ నెల 28న సాయంత్రం 7:10 గంటలకు రైలు నంబర్ 06567 బయల్దేరుతుందన్నారు. మాండ్య, కెంగేరి, బెంగళూరు, యశ్వంతపూర్, తుంకూరు, అర్సీకెర, చిక్కజాజూరు, చిత్రదుర్గ, రాయదుర్గం, బళ్లారి కంటోన్మెంట్, హొస్పేట్, బాదామి, బాగల్కోట్ మీదుగా శనివారం మధ్యాహ్నం 2 గంటలకు విజయపుర చేరుకుంటుందన్నారు. తిరుగు ప్రయాణంలో ఈ నెల 31న రైలు నంబర్ 06568 విజయపురలో సోమవారం సాయంత్రం 7 గంటలకు బయల్దేరి ఇదే మార్గంలో మంగళవారం మధ్యాహ్నం 2.20 గంటలకు మైసూరు చేరుకుంటుందన్నారు. ఈమార్గంలో ప్రత్యేక రైలును ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని, రిజర్వేషన్ వసతి కల్పించినట్లు చెప్పారు.

విద్యార్థులు కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు

వజ్రకరూరు: విద్యార్థులు కష్టపడి చదివితే భవిష్యత్తు ఉంటుందని ఎంఈఓ తిమ్మప్ప సూచించారు. శనివారం మండలంలోని తట్రకల్లు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను ఎంఈఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న రాగిజావాను పరిశీలించారు. అనంతరం పాఠశా లలో 6,7,8 తరగతి చదువుతున్న బాలికలకు నిర్వహిస్తున్న స్వీయరక్షణ శిక్షణా కార్యక్రమాన్ని పరిశీలించారు. బాలికలు శత్రువులబారి నుంచి తమను తాము ఎలా రక్షించుకోవాలో సూచనలు చేశారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు రావాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రఘురాములు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



స్వీయరక్షణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ తిమ్మప్ప తదితరులు

సంక్షిప్త సమాచారం

దరఖాస్తుల స్వీకరణ

బెళుగుప్ప: కేజీబీవీల్లో 2025–26 విద్యా సంవత్సరం 6,11 తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎస్ఓ నాగరత్న శనివారం తెలిపారు. 7,8,9 తరగతుల్లో మిగులు సీట్లకు సంబంధించి ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అనాథలు, బడి బయట పిల్లలు, డ్రాపౌట్లు, పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బీపీఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు.

వజ్రకరూరు: తట్రకల్లు కేజీబీవీలో 2025–26 సంవత్సరం ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ధనలక్ష్మి తెలిపారు. శనివారం తట్రకల్లులోని కేజీబీవీలో ఆమె మాట్లాడుతూ విద్యాలయంలో 6వ తరగతి, ఇంటర్‌మీడియెట్ మొదటి సంవత్సరం (సీఈసీ గ్రూపు)లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆరోతరగతిలో 40 సీట్లు, ఇంటర్ సీఈసీ గ్రూపులో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈనెల 22 నుంచి ఏప్రిల్ 11వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

గుమ్మఘట్ట: మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడినట్లు ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు. శనివారం జరగాల్సిన సర్వసభ్య సమావేశానికి సభ్యులు రాకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంఈఓ నాగమణి, ఎస్ఐ ఈశ్వరయ్య, మండల స్థాయి అధికారులు హాజరయ్యారు.

తెగి పడిన విద్యుత్ వైరు

కళ్యాణదుర్గం: స్థానిక బళ్లారి మిట్ట ప్రాంతంలో కరెంట్ స్తంభం నుంచి విద్యుత్ సర్వీస్ వైరు శనివారం తెగిపడింది. అయితే ఆ సమయంలో విద్యుత్ సరఫరా ఉన్నా.. వైరు కింద పడినప్పుడు అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న విద్యుత్ అధికారులు అప్రమత్తమై విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అనంతరం తెగిపడిన విద్యుత్ వైరుకు మరమ్మతులు చేసి, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. వైరు తెగిపడిన సమయంలో ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

అక్కమాంబ ఆలయ కమిటీ చైర్మన్ రాజీనామా

కళ్యాణదుర్గం రూరల్: పట్టణ సమీపంలో ఉన్న అత్యంత ప్రసిద్ధి చెందిన అక్కమాంబ ఆలయం కమిటీ చైర్మన్ బత్తినిరాము శనివారం తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని రిజిష్టర్ పోస్టు, మెయిల్ ద్వారా ఎండోమెంట్ కార్యాలయానికి (అనంతపురం) శనివారం పంపారు. చైర్మన్ పదవితో పాటు కమిటీ సభ్యులు ఆరుగురు రాజీనామా చేశారు.

నేమకల్లు ఆంజనేయస్వామికి పూజలు

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన నేమకల్లు ఆంజనేయస్వామికి శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామి మూలవిరాట్‌కు పట్టువస్త్రాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్‌స్వామి ఆధ్వర్యంలో పురోహితులు వేకువజాము నుంచే స్వామికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ, వెండి తమలపాకు అలంకరణ, అర్చనలు, అభిషేకాలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

సీతారామస్వామి ఆలయంలో పూజలు

వజ్రకరూరు: స్థానిక బలిజవీధిలోని సీతారామస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం ప్రత్యేక పూజలు చేశారు. స్థానికులతోపాటు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయంలో పూజలు చేశారు. జనార్దన వేంకటేశ్వరస్వామి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు చేశారు.

పీహెచ్‌సీ భవనం నిర్మించండి

కూడేరు: సార్.. కొర్రకోడులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం నిర్మించాలని సర్పంచు చంద్రశేఖర్ యాదవ్, గ్రామస్తులు జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్‌కు విన్నవించారు. శనివారం పీఏబీఆర్‌లో చేపపిల్లలను వదిలారు. కార్యక్రమం అనంతరం కలెక్టర్‌ను కొర్రకోడు సర్పంచు, గ్రామస్తులు కలిశారు. పీహెచ్‌సీకి రెండెకరాల స్థలం కేటాయించారని, ఏడాది క్రితం భవన నిర్మాణ పనులకు భూమిపూజ చేశారన్నారు. కానీ పనులు ప్రారంభించలేదన్నారు. అదేవిధంగా హైస్కూల్ భవన నిర్మాణానికి నాలుగు ఎకరాలు కేటాయించగా 'నాడు–నేడు' కింద 80 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులు పూర్తి చేయలేదన్నారు.

రీ సర్వేపై అవగాహన ర్యాలీ



ములకనూరులో ర్యాలీ చేస్తున్న దృశ్యం

కంబదూరు: ములకనూరులో ఆర్డీఓ వసంతబాబు ఆధ్వర్యంలో రెండో విడత భూములు రీసర్వేపై శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్, ఎంపీడీఓ, రీసర్వే బృందం సభ్యులు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది ర్యాలీలో పాల్గొన్నారు. ఆర్డీఓ మాట్లాడుతూ రీసర్వేకు వెళ్లే ముందు రోజే రైతులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఒక వేళ రైతులు అందుబాటులో లేకపోయినా, హాజరు కాలేకపోయినా మూడుసార్లు అవకాశం ఇవ్వాలన్నారు. రైతుల సమక్షంలోనే రీసర్వేను పక్కాగా చేయాలని ఆదేశించారు. అనంతరం గ్రామసభ నిర్వహించి, రీ సర్వే వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు.

ఎరువుల విక్రయాలతో ఆదాయం



మాట్లాడుతున్న జిల్లా కోఆర్డినేటర్ మాధవి

బొమ్మనహాళ్: గ్రామాల్లో తడిపొడి చెత్తను చెత్తతో సంపద తయారీ కేంద్రాలకు తరలించి ఎరువు తయారీ చేసి విక్రయించడం వల్ల పంచాయతీలకు ఆదాయం వస్తుందని జిల్లా కోఆర్డినేటర్ మాధవి, ఎంపీడీఓ విజయభాస్కర్ అన్నారు. శనివారం మండలంలోని నేమకల్లు గ్రామంలో రాయదుర్గం, గుమ్మఘట్ట మండలాల్లోని పంచాయతీ కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్లకు ఒక్క రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ దాస్, సర్పంచ్ పరమేశ్వర, పంచాయతీ కార్యదర్శి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి



సీఐ జయానాయక్‌కు వినతిపత్రం అందిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

రాయదుర్గంటౌన్: గలగల గ్రామానికి చెందిన చిన్నారి మృతికి కారణమైన ఆర్ఎంపీపై విచారణ చేపట్టి, క్రిమినల్ కేసు నమోదు చేయాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు శనివారం సీపీఐ, సీపీఎం, ఏఐవైఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు సంయుక్తంగా అర్బన్ సీఐ జయానాయక్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. సీపీఎం నాయకులు మల్లికార్జున, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బంగి శివ, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొట్రేష్ పాల్గొన్నారు.

వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్యాయత్నం

బొమ్మనహాళ్: మైలాపురం గ్రామంలో భర్త, అత్త, మరిదిల వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకొచ్చింది. ఎస్ఐ నబీరసూల్ తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన తిమ్మారెడ్డికి బెలుగుప్ప మండలం రామసాగరం గ్రామానికి చెందిన కాపు నీలిమతో ఆరేళ్ల క్రితం వివాహం జరిపించారు. వీరికి నాలుగేళ్లు, రెండేళ్ల వయసున్న కుమారులు ఉన్నారు. కొన్నాళ్లుగా నీలిమ భర్త తిమ్మారెడ్డి, అత్త గంగమ్మ, మరిది అదనపు కట్నం కోసం వేధిస్తున్నారు. మనస్తాపానికి గురైన ఆమె ఈనెల 14న ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో కుటుంబ సభ్యులు బళ్లారి విమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం ఆమె విమ్స్‌లో చికిత్స పొందుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.